క్లుప్తంగా

శ్రీగిరిలో భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం


వాస్తు పూజ చేస్తున్న చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

ఒంగోలుమెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేశారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

మూడో అంతస్తు నిర్మాణానికి వాస్తు పూజ
శ్రీగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్వహణలోని గోశాల, వేదపాఠశాల విస్తరణలో భాగంగా మూడో అంతస్తు నిర్మాణాన్ని వాస్తు పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమాలను శ్రీగిరి ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు జ్వాలా రామారావు, కార్య నిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు, నీరజ ట్రాన్స్ పోర్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. అష్టోత్తర శత సహస్ర కలశాభిషేకం కార్యక్రమంలో పాల్గొనే భక్తులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడికి సన్మానం


సన్మానం అందుకుంటున్న పాశం వెంకటేశ్వర్లుయాదవ్

ఒంగోలు సెంట్రల్: సమాజ్‌వాదీ పార్టీ ఏపీ అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లుయాదవ్‌ను ఆదివారం ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. యాదవ సంఘ విద్యావంతుల ఆధ్వర్యంలో రంకర్ యాదవ్ అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. పాశం వెంకటేశ్వర్లుయాదవ్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం సమాజ్‌వాదీ పార్టీతో సాధ్యమని చెప్పారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు ఎర్రగడ్డ నాగరాజు, రామకృష్ణ, కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల లెవెలింగ్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అంజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, రుక్మిణమ్మ, తిరుపతిరావు

ఈతముక్కల(కొత్తపట్నం): మండలంలోని ఈతముక్కల గ్రామంలోని చేనేత కాలనీలో ఇళ్ల స్థలాల లెవెలింగ్‌కు ఆదివారం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బందారు రుక్మిణమ్మ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు అడిగోపుల లక్ష్మీనారాయణ, వీవర్స్ సొసైటీ మాజీ అధ్యక్షుడు, పద్మశాలి సంఘ అధ్యక్షుడు అడిగోపుల శ్రీరామ్మూర్తి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో 62 ప్లాట్లను లెవెలింగ్ చేస్తున్నట్లు తెలిపారు. లెవెలింగ్ పూర్తయిన తర్వాత చేనేత కార్మికులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బందారు వెంకటసుబ్బారావు, ఎం.నరసింహరావు, తిరువీధుల రామారావు, బందారు వెంకటాద్రి, చేనేత కార్మికులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణే లక్ష్యం


పాత బైపాస్ రోడ్డులో డివైడర్లపై మొక్కలకు నీరు పోయకపోవడాన్ని గమనించి కూలీలను హెచ్చరిస్తున్న కమిషనర్


చేపల మార్కెట్ వద్ద మురుగు తొలగింపును పర్యవేక్షిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

- డివైడర్లపై మొక్కల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి
- ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర సుందరీకరణే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. నగరంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పర్యవేక్షించారు. అందులో భాగంగా కర్నూలు రోడ్డు ఫ్లై ఓవర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, అద్దంకి బస్టాండ్ సెంటర్, పాత మార్కెట్, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, కలెక్టర్ బంగ్లా రోడ్డు, ప్రకాశం భవన్ ముందు ఉన్న ట్రంక్ రోడ్డు వరకు స్పాట్ హోల్స్, స్ట్రీట్ లైటింగ్, డివైడర్ల ఆధునికీకరణ పనులను పరిశీలించారు. అదేవిధంగా కర్నూలు రోడ్డులో రోడ్ల మరమ్మతు పనులను పర్యవేక్షించారు. మరమ్మతులను నిబంధనల మేరకు పూర్తి చేయాలని, లోపాలుంటే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవని హెచ్చరించారు. డివైడర్లపై మొక్కల పెంపకం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చేపల మార్కెట్ వద్ద కాలువల్లో మురుగు ఎక్కువగా ఉండటాన్ని గుర్తించి అప్పటికప్పుడు జేసీబీ తెప్పించి శుభ్రం చేయించారు. నగర సుందరీకరణపై ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కమిషనర్ పేర్కొన్నారు. నగరాన్ని మురుగు రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. నగరంలోని అంబేడ్కర్ నగర్ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ వెంట నగర శానిటేషన్ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్య, డీఈ పద్మజ, ఒంగోలు నగర పాలక సంస్థ రెవెన్యూ, ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘ అధ్యక్షుడికి అభినందన


షేక్ ఖాశింవలిని అభినందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఒంగోలు: మూడు దశాబ్దాలుగా ఎస్సీ, ఎస్టీ బీసీ, ముస్లిం మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న షేక్ ఖాశింవలి ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం సంతోషకరమని దళిత సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎంసీఏ భవన్‌లో అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఖాశింవలి మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శివాజీ, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు రఫీ, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిమాల సంపత్‌కుమార్, మాలభేరి జాతీయ అధ్యక్షుడు చప్పిడి ప్రీతం, మాల యువసేన అధ్యక్షుడు మేడికొండ సాగర్, చీరాల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ నీలంశక్తి ప్రదీప్, మాదిగ చైతన్య వేదిక అధ్యక్షుడు తేళ్ల దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నాగులుప్పలపాడు: మండలంలోని ఈదుమూడి గ్రామంలో మనం-మన ఊరు-మన ఈదుమూడి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సిరి ఉచిత మెగా మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించినట్లు నిర్వాహకుడు కావూరి వాసు తెలిపారు. వైద్య శిబిరంలో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు చెప్పారు. ప్రతి నెలా 3వ వారంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చాపల వంశీకృష్ణ, సేవా సంస్థ సభ్యులు నాగ వెంకట వరప్రసాదు, ఉప్పల శ్రీను, వైద్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భానుమిత్ర మరణం తీరని లోటు


భానుమిత్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేఎన్‌పీఎస్ నాయకులు, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, ప్రజాసంఘాల నాయకులు

చీమకుర్తి: సామాజిక ఉద్యమకారుడు సంగా భానుమిత్ర మరణం ప్రజాసంఘాల ఉద్యమాలకు తీరని లోటని కేఎన్‌పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు అన్నారు. ఇటీవల భానుమిత్ర మరణించడంతో ఆదివారం చీమకుర్తిలో ఏర్పాటు చేసిన సంతాప సభలో ఆయనతో పాటు భానుమిత్ర కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రావుతో పాటు ప్రజాకళామండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే కోటి, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య మాట్లాడుతూ 1986లో భానుమిత్ర జననాట్యమండలిలో సభ్యత్వం స్వీకరించినప్పటి నుంచి పలు ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్నారన్నారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కొత్రపు రాఘవరావు, పిన్నిక శ్రీనివాసరావు, పేరం శ్రీనివాసరావు, షేక్ ఖాదర్‌బాషా, స్థానిక కళాకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ


ట్రాక్టర్‌తో దున్నుతున్న అక్రమార్కులు

గుడ్లూరు: కోర్టు స్టే ఆర్డర్ ఉన్న ప్రభుత్వ భూమిని అక్రమార్కులు ఆక్రమించుకొని దున్నుతున్న సంఘటన మండలంలోని గుండ్లపాలెం గ్రామంలో జరిగింది. వివరాల ప్రకారం... గుండ్లపాలెం అడ్డరోడ్డు వద్ద సర్వే నంబర్ 237లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని గతంలో గ్రామానికి చెందిన అక్రమార్కులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నారు. అయితే నెల రోజుల క్రితం అది ప్రభుత్వం భూమి అని గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన ప్రభుదాసు, ఆదాం, జాలయ్య, సురేష్ తదితరులు కోర్టుకు వెళ్లారు. దీనిపై కోర్టు స్టేషన్ కో ఆర్డరఇచ్చింది. రెవెన్యూ అధికారులు అది ప్రభుత్వ భూమి అని, దాన్ని ఎవరూ అక్రమించుకోరాదని ఐదెకరాల వద్ద బోర్డు ఏర్పాటు చేసి గ్రామంలో దండోరా వేయించారు. అయినా సెలవు రోజు కావడంతో అక్రమార్కులు ఆదివారం ఆ భూమిలో ట్రాక్టర్‌లో దున్నడం మొదలుపెట్టారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అగ్ని అస్త్రం కషాయం తయారీపై అవగాహన


కషాయాన్ని తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఒంగోలు సెంట్రల్: రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ఆధ్వర్యంలో కొప్పోలు గ్రామంలో ఆదివారం పురుగుల నివారణకు వినియోగించే అగ్ని అస్త్రం కషాయాన్ని తయారు చేశారు. వెల్లుల్లి, మిరపకాయలు, ఆవుమూత్రంతో కషాయాన్ని ఎలా తయారు చేయాలో ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వాకా మాధవి, ఐసీఆర్పీలు పీవీ సుభాషిణి, షేక్ రజియా, ఎన్.కృష్ణవేణి, అమరవాణి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కోటిసోమవారం


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు

మార్కాపురం టౌన్: కార్తీక మాసంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. ఆదివారం కోటిసోమవారం సందర్భంగా మార్కాపురం నియోజకవర్గంలో పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. మార్కాపురం శివారులోని అల్లూరి పోలేరమ్మ అమ్మవారి ఆలయానికి పట్టణ ప్రజలతో పాటు వేములకోట, సీతనాగులవరం, రామచంద్రపురం తదితర గ్రామాల భక్తులు కుంకుమ బండ్లతో వచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ఈవో చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మార్కాపురం రూరల్: మండలంలోని వేములకోట, తిప్పాయిపాలెం, గజ్జలకొండ, నికరంపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. వేములకోట శివాలయంలో అర్చకులు దామసాని చంద్రశేఖరశర్మ, జిల్లెల్ల నాగరాజుశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. అత్యంత పురాతనమైన వేములకోట శివాలయంలో ఈనెల 26న కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపోత్సవం, స్వామివారి కల్యాణం నిర్వహించడంతోపాటు జ్వాలా తోరణం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు దామసాని వెంకట్రామయ్య తెలిపారు. పౌర్ణమి రోజున రుద్రాభిషేకాలు చేస్తామని చెప్పారు.

తర్లుపాడు: కేతగుడిపి గ్రామంలోని గంగా పార్వతి సమేత కేదారేశ్వరస్వామి ఆలయంలో కోటిసోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారికి అభిషేకాలు చేశారు. మార్కాపురం పట్టణంతోపాటు సమీప గ్రామాల భక్తులు హాజరై అభిషేకాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రాము, రాఘవశర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కొనకనమిట్ల: గొట్లగట్టు, కొనకనమిట్ల, రేగడపల్లి, పెదారికట్ల, ఎదురాళ్లపాడు, చినారికట్ల, బ్రాహ్మణపల్లి, సలనూతల, అంబాపురం గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు కోటి సోమవార పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు శ్రీశైలం, బైరవకోన, రామతీర్థం పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు.

తపోవనం పీఠాధిపతి ప్రత్యేక పూజలు
త్రిపురాంతకం: శ్రీబాలాత్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాలలో తుని తపోవనం పీఠాధిపతి శ్రీసచ్చిదానంద సరస్వతి స్వామీజీ ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చిన ఆయనకు ఈఓ చెన్నకేశవరెడ్డి, అర్చకులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి పూర్ణకుంభస్వాగతం పలికారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపించారు. కార్తీక మాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి ప్రత్యేకంగా అభిషేకాలు, కుంకుమార్చనల్లో పాల్గొన్నారు.

గుంటిగంగా భవానికి ప్రత్యేక పూజలు
తాళ్లూరు (ముండ్లమూరు): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గుంటి గంగాభవాని అమ్మవారికి భక్తులు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు 12 చీరెలు బహూకరించారు. ఈఓ భాస్కరరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం ఏర్పాటు చేశారు.


ప్రత్యేక పూజలు చేసిన తుని తపోవనం పీఠాధిపతి

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు
బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా శ్రీవారి చక్ర స్నానం
పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లో వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీవారి చక్రస్నానం వైభవంగా సాగింది. ముందుగా ఉభయదాతలు యాదాల కోటేశ్వరరావు, జయప్రద దంపతులు హోమం, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఉభయదాతలు శ్రావణి వెంకటేశ్వర్లు, విజయగౌరి, వరికుంట్ల అనిల్, లక్ష్మీ సురేఖ దంపతులు చక్రస్నానం కార్యక్రమం పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఉత్సవ కార్యక్రమాలు తిలకించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాలను అధ్యక్షులు యక్కలి శేషగిరిరావు, కార్యదర్శి పెరుమాళ్ల భాస్కర్‌రావు, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

దర్శి: పట్టణంలోని లక్ష్మీ గణపతి స్వామి ఆలయంలో నాలుగో వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కోటి సోమవారం పురస్కరించుకుని లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ శాంతి హోమం, మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు వేదపండితుల చేసి ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించినట్లు ఆలయ గురుస్వామి రమణయ్య తెలిపారు. హాజరైన భక్తులకు పంచామృత తీర్థ, అల్పాహార ప్రసాదాలు అందజేశారు.


పూజలందుకుంటున్న లక్ష్మీ గణపతి స్వామి